www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 9 జూన్ 2025
5
వైఎస్ఆర్

కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డిఆర్ఒవిశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమ వారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందని .ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.

విత్తనం ఏదీ?

- వేరుశనగ సాగుకు సమీపిస్తున్న గడువు
- విత్తన పంపిణీ కోసం రైతుల ఎదురు చూపులు
- పొలాలను దుక్కి దున్నుతున్న రైతులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో మెట్ట రైతులు సేద్యపు పనుల్లో నిమగ్నమయ్యారు. పనులు పూర్తికాగానే పదును వాన కురిస్తే వేరుశనగ విత్తడానికి సమాయత్తం అవుతున్నారు. అన్నదాతలను విత్తన కొరత వేధిస్తోంది. ప్రతి ఏటా ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశనగ సరఫరా చేసేది. ఈ సారి విత్తన వేరుశనగ పంపిణీ చేస్తారో లేదోననే ఆందోళన రైతుల్లో నెలకుంది. ఒకింత ఆందోళన, ఆగ్రహానికి గురవుతున్నారు. అదును సమీపిస్తుండటంతో విత్తనకాయలు ఎప్పుడు కొనుగోలు చేయాలి. ఎప్పుడు సిద్ధం చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20వేల ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉంది. ప్రతిఏటా 10 వేల నుంచి 12వేల ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగుచే స్తున్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు మురిపి స్తుండటంతో వేరుశనగ విస్తీర్ణం పెరిగే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసి, ముందస్తు వర్షాలు వస్తే శాస్త్రవేత్తలు చెప్పిన ప్రకారం జూన్ 15 లోపు వేరుశ నగ విత్తడానికి సిద్ధమవుతున్నారు.

పది రోజులే సమయం..

జూన్ రెండో వారం నుంచి జులై 15లోపు వేరుశనగ సాగుచేస్తే, మంచి దిగుబడులు వస్తాయని వ్యవ సాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తు వేయడానికి పది రోజులే సమయముంది. ఇంకా ప్రభుత్వం సబ్సిడీ విత్తనకాయలు సరఫరా చేయలేదు. ప్రతిఏటా ఐదు ఎకరాల్లో సాగు చేసేవాడిని ఈఏడాది ఇంకా సాగు విస్తీర్ణం పెంచాలను కుంటున్నా ప్రభుత్వం రాయితీతో విత్తనాలు ఇస్తే ఎన్ని ఎకరాల్లో సాగుచేసేది నిర్ణయించు కుంటాం.

- భాస్కర్ రెడ్డి, రైతు లింగాల మండలం

ఎప్పుడిస్తారో ఏమో..

ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ కాయలు ఎప్పుడిస్తుందో ఏమో ఇంకా తెలియడం లేదు. శనిక్కాయలు కొనుగోలు చేయాలి. వాటిని వలచాలి. శుభ్రం చేయాలి. పంపిణీ ఆలస్యమైతే మంచి కార్తెలు దాటి పోతాయి. వెంటనే ప్రభుత్వం వేరుశనగ విత్తనకాయలను సరఫరా చేయాలి. సకాలంలో విత్తనకాయలు అందకపోతే చిరుధాన్యాలైనా సాగు చేసుకుంటాం.

- జనార్దన్ రెడ్డి, రైతు, పులివెందుల

దుక్కి దున్నుతున్న రైతు

ఎస్‌జిటిల బదిలీలు మాన్యువల్ పద్ధతిలోనే

కౌన్సెలింగ్ నిర్వహించాలి

డిఇఒ కార్యాలయం ముట్టడిలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్

ముట్టడిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌టిజి బదిలీలకు సంబంధించి మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని వెబ్ కౌన్సెలింగ్ వద్దని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ముట్టిడి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2 వేల మంది ఉపాధ్యాయుల హాజరై తమన నిరసన తెలియజేశారు. 'వెబ్ కౌన్సెలింగ్ వద్దు మాన్యువల్ కౌన్సిలింగ్ ముద్దు' అంటూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు నినదించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయ సంఘాలు ధర్నాకు పిలుపు ఇచ్చినప్పుడు కమిషనర్ ఎస్‌జిటిల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మాట తప్పి ఎస్‌జిటిలందరిని ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్‌లలో వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా తాను అనుకున్న విధంగానే పంతాన్ని నెగ్గించుకోవడం కమిషనర్ మొండి వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అనేక పొరపాట్లు జరిగాయని, దీని ద్వారా ఎస్‌జిటిల అధిక సంఖ్యలో ఉండడం, చాలా మంది ఉపాధ్యాయులకు వెబ్ పైన అవగాహన లేకపోవడం వల్ల వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కౌన్సెలింగ్‌న మాన్యువల్ విధానంలోనే జరపాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సంఘం నాయకుల వెంకట శివారెడ్డి, ఇలియాస్ బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి, సురేష్ బాబు, గుజ్జుల తిరుపాల్, బండి విశ్వనాథరెడ్డి, లక్ష్మి రాజా, పాలేం మహేష్, శ్యాంసుందర్ రెడ్డి, ఖాదర్ బాషా, మాదన విజయ్ కుమార్, చెన్నయ్య, కొండారెడ్డి, బత్తిని నాగేశ్వరరావు, రామాంజనేయులు, ప్రవీణ్ కిరణ్, శివశంకర్ రెడ్డి,సజ్జల రమణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎ.బి.రామకృష్ణరాజు, వివిధ సంఘ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి పోరాటాలే దిక్సూచి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు

సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎం కార్యకర్తలు సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలని, సమాజ అభివృద్ధికి పోరాటాల దిక్సూచి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు అన్నారు ఆదివారం యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవాళ పెట్టుబడిదారి సమాజంలో దోపిడీదారులను, పెత్తందారులను, దుర్మార్గుల అన్యాయాలను ప్రశ్నించాలంటే సిపిఎం కార్యకర్తలు సైదాంతిక, రాజకీయ, సామాజిక స్పృహ స్థాయిని తప్పనిసరిగా పెంచుకోవాలని పిలుపునిచ్చారు. జనతా ప్రజాతంత్ర విప్లవ వ్యూహం, ఎత్తుగడలు, విప్లవ దశలు, పార్టీ కార్యక్రమం, దశ, దిశలు వంటి వాటిపై పార్టీ కార్యకర్తలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని తెలిపారు. ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఐక్యంగా విరోచిత పోరాటం నిర్వహించారని పేర్కొన్నారు. జమీందారులకు, భూస్వాములకు, ఆర్థిక, సామాజిక, మానసిక దోపిడీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారని చెప్పార. ప్రజా చైతన్యంతో, ప్రజా తిరుగుబాటులతో లక్షలాది ఎకరాలు దున్నేవానికి భూ పంపిణీ చేశారని తెలిపారు. ప్రస్తుతం పెట్టుబడిదారి సమాజంలో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలంటే సిపిఎం కార్యకర్తలకు ఉక్కు క్రమశిక్షణ కలిగి ఉండాలని చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, వి.అన్వేష్, బి.దస్తగిరి రెడ్డి, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు కుమార్ స్వామి రెడ్డి, చంద్రారెడ్డి, శివరాం, వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు వి.శివకుమార్, జి.సునీల్ కుమార్, చిన్ని, రాహుల్ మండల కమిటీల సభ్యులు, కార్యదర్శులు, పార్టీ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

అశోక్ నగర్‌లో ఈనెల 1న సయ్యద్ చాన్ బాష హత్య కేసులో ఐదుగురిని నిందితులను అరెస్టు చేసినట్లు చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ సిఐ జి. ఓబులేసు తెలిపారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురిని వాటర్ గండికి పోయే రోడ్డులో ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో షేక్. మహబూబ్ బాషా, అయేషా, ప్యారి, మహమ్మద్ రఫీ, ఒక మైనర్ ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి హత్యకు వాడిన మచ్చు కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

దొంగతనం కేసులో మరో నిందితుడు.. కడప నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 20 కి పైగా దొంగతనం కేసులు ఉన్న నిందితుడు షేక్.అక్బర్ ఆలీని కడప ఎయిర్‌పోర్ట్ లో విమానం ఎక్కుతుండగా అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. నిందితుడి నుంచి 40.160 గ్రాముల బరువు గల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ రూ.3.50 లక్షలని పేర్కొన్నారు. దొంగతనం చేసిన డబ్బుతో గోవా, ఢిల్లీ ప్రాంతాలకు వెళ్లి గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, ఇతర జూదాలకు వినియోగిస్తూ ఉంటాడని తెలిపారు. కేసులు ఛేదించిన చిన్న చౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, శివకుమార్, కానిస్టేబుల్ శ్రీనివాసులు, ఖాదర్ బాషా, నాగరాజు, మాధవరెడ్డి, శ్రీదేవి, ప్రభావతిని అభినందించారు. వీరికి రివార్డులు వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు.

రమేష్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండవసారి ఎన్నికైన రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎన్నికైన సుదర్శన్ రెడ్డిని ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు రఘు రామ నాయుడు అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాషస్థాయి పదవులు పొందిన వారిని అభినందించారు. జిల్లా సంఘం లో ఖాళీ ఏర్పడిన జిల్లా కార్యదర్శి పదవికి కృష్ణ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా కో ఆప్షన్ సమావేశంలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాలి

20.74 లక్షల మొక్కల పంపిణీకి శ్రీకారం
37 శాతానికి గ్రీనరీని పెంచడమే లక్ష్యం
జిల్లా ఫారెస్ట్ అధికారి ఎం.శివకుమార్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా తీసుకుని పెంచాలి. ఇటీవల పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మొక్కల పెంపకాన్ని ఉద్యమస్ఫూర్తితో చేపట్టాం. 2029 నాటికి అటవీ సాంద్రత 29 శాతం నుంచి 37 శాతానికి తీసుకెళ్లాలనే హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమ లక్ష్యానికి అనుగుణంగా ముందుకెళ్తున్నాం. ఇందులోభాగంగా మొక్కలు నాటిన ప్రాంతాల అక్షాంశాలు, రేఖాంశాలను తీసుకుని వెరీలైఫ్ పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతోంది. డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ కమిటీ చైర్మన్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిడిఒలు, మున్సిపాలిటీలు, డ్వామా, హార్టీకల్చర్, డిఆర్‌డిఎ డిపార్టుమెంట్ల సహకారంతో ముందుకె ళ్తున్నామని పేర్కొంటున్న జిల్లా సోషల్ ఫారెస్ట్ అధికారి యం.శివ కుమార్‌తో ముఖాముఖి..

ముఖా ముఖి..

పర్యావరణ దినోత్సవ తీరుతెన్నులను వివరించండి?

జిల్లా ఫారెస్ట్ కమిటీ చైర్మన్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవాలను జయప్రదంగా నిర్వహించడమైంది. జిల్లాలోని డ్వామా, డిఆర్‌డిఎ, ఫారెస్ట్, మున్సి పాలిటీలు, హార్టికల్చర్ డిపార్టుమెంట్ల సహకారంతో మొక్కల పెంప కాన్ని ఉద్యమ స్ఫూర్తితో చేపట్టడమైంది.

మిషన్ హరితాంధ్రప్రదేశ్ వివరాలు తెలపండి?

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన మిషన్ హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమ లక్ష్యమైన 2029 నాటికి 29 శాతం నుంచి 37 శాతానికి పచ్చ దనాన్ని తీసుకెళ్లాలనే ఉద్దేశంతో జిల్లా ఫారెస్ట్ డిపార్టుమెంట్ 20.74 లక్షల మొక్కలను పెంచడమైంది.

మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జిల్లా ఫారెస్ట్ డిపార్టుమెంట్ నాటిన 20.74 లక్షల మొక్కల అక్షాంశాలు, రేఖాంశాల వివరాలను వెరీలైఫ్ పోర్టల్‌లో నమోదు చేయడమైంది. వర్షాకాలంలో నాటడం ద్వారా వర్షాలు, సిబ్బంది సహాయ సహకారాలతో పరిరక్షించే ప్రయత్నం చేయడం జరుగుతుంది. దీనికితోడు వెబ్‌పోర్టల్ మొక్కల అక్షాంశాలు, రేఖాంశాల ఆధా రంగా మొక్కల సంక్షరణకు మెరుగైన అవకాశాలు ఉంటాయని గ్రహించాలి.

మొక్కల పెంపకం, ఇతర శాఖల సహకారంపై మాట్లాడండి?

పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన మొక్కల పెంపక ఉద్యమంలో డ్వామా, డిఆర్‌డిఎ, హార్టీకల్చర్, మున్సిపాలిటీలు విభాగాలను కలుపుకుని వెళ్లాం. సహచర డిపార్టుమెంట్ల ప్రణాళికల ఆధారంగా ఏడాదిపాటూ ప్లాంటేషన్ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది.

కలెక్టర్ పిలుపునకు స్పందన కనిపించిందా?

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పచ్చదనం ఆవశ్యకతను గుర్తించి యువతకు ఇచ్చిన సందేశం బాగుంది. బర్త్‌డే, తల్లి పేరిట గుర్తుగా మొక్కలు నాటాలని ఇచ్చిన పిలుపు అందరినీ ఆకట్టుకుంది. కానీ ఆచరణలో ఏమేరకు ఫలితం కనిపించినా, కనిపించకపోయిన ప్రభావాన్ని అయితే కచ్చితంగా ఇస్తుందనే నమ్మకంగా చెప్తున్నా.

మొక్కల పంపిణీ గురించి తెలపండి?

జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థలైన పాఠశాలలు, కళాశాలలకు ఉచితంగా పంపిణీ చేస్తాం. కేంద్రప్రభుత్వ పథకమైన ఏక్‌ఫెయిడ్, కంఫా, యుఎల్, విల్డ్‌లైఫ్, ఎన్‌ఆర్‌ఇజిఎస్, 09 మిక్స్‌డ్ ప్లాంటేషన్, ఆన్యువల్ ప్లాంటేషన్ పథకాల్లో భాగంగా ఉచితంగా మొక్కలను పంపిణీ చేయడం జరుగుతోంది. గ్రీనరీ పెంపకంలో భాగంగా టెర్రి టోరియల్ ఫారెస్ట్ డిపార్టుమెంట్ సైతం మొక్కలను నాటడానికి చర్యలు తీసుకుంటోంది.

నర్సరీల వివరాలు తెలపండి?

జిల్లాలో ఎనిమిది నర్సరీలు ఉన్నాయి. కడప నగర శివారులోని బుగ్గడ్యామ్, మద్దిమడుగు, కమలాపురం, కొండూరు, ప్రొద్దుటూరు, మైదుకూరు, వేంపల్లి, జమ్మలమడుగు ప్రాంతాల్లో నర్సరీలు ఉన్నాయి.

బహుమతులు పొందిన విద్యార్థులు

ప్రతిభ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - బద్వేలు

గొప్ప వాళ్ళందరూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శవంతంగా నిలిచారని, నేటి యువత కూడా వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, రిటైర్డ్ డిఎస్‌పి కె. సి. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం అరవింద్ ఫౌండేషన్‌వారి కార్యవర్గ సభ్యులు బద్వేల్ గురుమూర్తి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రవం అందజేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 'రతన్ టాటా' ను ఆదర్శంగా తీసుకొని 'అరవింద్ ఫౌండేషన్' ఏర్పాటు చేసి సామాజిక సేవ, చైతన్య కార్యక్రమాలు చేస్తున్న వ్యవస్థాపకులు అమెరికాలో వుంటున్న రవీంద్రప్రసాద్ కలకడ, కుటుంబ సభ్యులు అభినందనీయులని చెప్పార. రిటైర్డ్ డిఎస్‌పి మాట్లాడుతూ గొప్పవాల్లందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల ద్వారా ప్రోత్సహించడం ఎంతో ఆదర్శనీయమని, ప్రతి ఒక్కరూ మహనీయులను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఘనుమంతు రాజేష్ కుమార్, బి.సి ఉద్యోగుల సంఘం నాయకులు కె.సుబ్బరాయుడు, టిడిపి బి.సి సెల్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ కుమార్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ అన్వర్ భాష, రిటైర్డ్ జూనియర్ లెక్చరర్ ఎం. శ్రీనివాసులు, ఎం.వి రమణయ్య యాదవ్, యానిక రామయ్య, బి. బాలగురన్న, సి.రంగరాజు,విద్యార్థినీ విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా సాహిత్య రథసారథి 'గానుగపెంట'

- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మన జిల్లాలో వేల సాహిత్య సభలు నిర్వహించడమే కాకుండా వేలాది సాహితీ మిత్రులను సత్కరించిన ఘనత ఒక్క గానుగపెంట హనుమంతరావుకే దక్కుతుందని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఇటీవల ఆయనకు తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో ప్రోస్టేట్ ఏన్ లార్జ్మెంట్ సర్జరీ విజయవంతంగా జరిగి కడపకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వారు ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంతరావు 2000లో భాగ్యలక్ష్మి ఫౌండేషన్, 2004లో మొల్ల సాహిత్య పీఠం ఏర్పాటుచేసి అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా సృజన శతకం, నందలూరు బౌద్ధారామం- సౌమ్యనాథుని దివ్య ధామం, తెలుగు వెలుగులు, అభినవ భువన విజయం, మహిళా స్ఫూర్తి - మొల్ల, హనుమద్ వికాసం తదితర రచనలు చేశారని పేర్కొన్నారు. ఆయన చేసిన సాహిత్య సేవలకు 2009లో రాష్ట్రపతి కె.ఆర్ నారాయణన్ చేతుల మీదుగా పండితరత్న బిరుదు, 2005లో ప్రధానమంత్రి అటల్ బీహారి వాజ్‌పేయి చేతుల మీదుగా జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2025లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఎన్.రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ మూడు రాష్ట్రాల గవర్నర్లతో జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న ఘనత హనుమంతరావుకే దక్కుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గానుగ పెంట హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెన్షన్స్ అసోసియేషన్ కోశాధికారి నూనె నగేష్, ఉపాధ్యక్షులు తుపాకుల నారాయణ, కార్యదర్శి సుబ్బరాయుడు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగమూర్తి, ఉపాధ్యక్షులు అంజిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద నాగరాజు, భాగ్యలక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి గానుగ పెంట మనోజ్ కుమార్,వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భూమిరెడ్డి రవి కళ్యాణ్, ప్రసిద్ధ రంగస్థల కళాకారుడు మధుబాబు, ప్రసాద్,రమణమూర్తి పాల్గొన్నారు.

గానుగపెంట హనుమంతరావును సన్మానిస్తున్న రచయితలు

అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

శ్రీ సత్య సాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లెలో దళిత బాలికపై అత్యాచారానికి పాల్పడిన 14 మంది పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో, లైంగిక దాడుల నుంచి, అత్యాచారాల నుంచి కాపాడడంలో ఘోరంగా వైఫల్యం చెందుతున్నారని ఆరోపించారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులను అందరిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అత్యాచారానికి పాల్పడిన వారిపట్ల ఆ నియోజకవర్గం శాసనసభ్యులు, కూటమి నాయకులు పోలీసులపై ఒత్తిడి చేసి అత్యాచార ఘటనలో పాల్గొన్న యువకులని కాపాడాలనుకోవడం సిగ్గుచేటని తెలిపారు. ఇలాంటి కీచకులను కాపాడితే కూటమి పార్టీలకు, ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పవలసి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మహిళలకు గట్టి భద్రత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోజు ఏదో ఒకచోట రాష్ట్రంలో, దేశంలో ఇలాంటి కీచకులకు మహిళలు బలవుతున్న ప్రభుత్వాలు గొప్ప గొప్ప మాటలు తప్ప చేతల్లో చేసేది శూన్యమని ఆరోపించారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే నిందితులందరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన దళిత బాలికను ప్రభుత్వం పూర్తిగా బాధ్యత తీసుకుని మంచి విద్యాసంస్థలో చేర్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

నేడు కాశినాయన మండల సమావేశం

ప్రజాశక్తి-కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని ఎంపిడిఒ సభాభవనంలో సోమవారంఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపిడిఒ మైథిలి ఒక ప్రకటనలో తెలిపారు సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు వారి సమాచారంతో వారు హాజరు కావాలన్నారు. ఏ ఒక్క అధికారి కూడా గైర్హాజరు అయ్యేందుకు అవకాశం లేదని తెలిపారు. అలా తెలియకుండా గైర్హాసయితే వెంటనే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నాపరు. అదేవిధంగా బినామీలుగా ఎవరు రాకూడదని ఎవరైతే ఎంపిటిసిలుగా ఉంటారో వారు మాత్రమే హాజరు కావాలన్నారు.

అమరావతిపై అసభ్య వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అమరావతిపై అసభ్య వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని టిడిపి మహిళా కౌన్సిలర్లు గాజుల శివ లక్ష్మి, చింతకుంట సరిత, మోతుకూరు జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అమరావతి ఇంద్రుడు ఏలిన రాజధాని ప్రాంతమని, ఆచార్య నాగార్జునుడి ప్రాంతమని, 5 కోట్ల ఆంధ్రుల కళల సౌధమని పేర్కొన్నారు. ఎపికి సెంటర్‌గా ఉండడం వల్లనే ఈ ప్రాంతాన్ని ఆది నుంచి చంద్రబాబు రాజధానిగా కోరుకున్నారని చెప్పారు. ఇటువంటి రాజధానిని వేశ్యల రాజధానిగా ఓ ప్రముఖ ఛానల్ డిబేట్‌లో పేర్కొనడం బాధాకరమన్నారు. కేవలం ఇదంతా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే జరుగుతోందని విమర్శించారు.

యాదవ భవన్‌కు స్థలం ఇవ్వాలి

- అధ్యక్షులు నారాయణ యాదవ్

ప్రజాశక్తి - కడప అర్బన్

యాదవ భవన్ నిర్మాణానికి ఆర్‌డిఒ సూచించిన స్థలాన్ని ఉచితంగా ఇవ్వాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ యాదవ్ కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ పని నుంచి అక్రమంగా నిధులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్టర్ కార్యాలయంలో పైకం చెల్లించనదే పనిచేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఎల్లయ్య, రామ్మూర్తి, శివశేఖర్, రామాంజనేయులు, బాబు, శీను, లక్ష్మయ్యకు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారాయణ యాదవ్

మంచినీటి స్కీంను ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

పార్టీలకతీతంగా ప్రజా సేవ

ప్రజాశక్తి - చక్రాయపేట

కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా ప్రజా సేవ చేస్తోందని మండల టిడిపి ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని నేర్సుపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య ఆహ్వానం మేరకు మహేశ్వరరెడ్డి ఆదివారం మూలపల్లి, దేవరగట్టపల్లి, కొండప్పగారిపల్లిలో మంచినీటి పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో మంచినీటి స్కీం ఏర్పాటు చేశారని తెలిపారు. కే రాజుపల్లె గ్రామ పంచాయతీ టిడిపి తనాయకులు పొట్టిపాటి శ్రీరామ్‌రెడ్డి ఆహ్వానం మేరకు మహేశ్వరరెడ్డి జలగంగమ్మ దేవస్థానంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటర్ కేబుల్ వైర్ చోరీ

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్ చోరీ ఘటనలు మండలంలో రోజురోజుకీ ఎక్కువ అవుతున్నాయి. స్టార్టర్లను ఎత్తుకెళ్లడం, కేబుల్ వైర్లను కత్తిరించుకపోవడం వంటి ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. మండల పరిధిలోని రహమత్‌ఖాన్ పల్లె సమీపంలో అగ్రహారానికి చెందిన రైతు సుబ్బరాయుడు పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లేసరికి మోటర్ల కేబుల్ వైర్ చోరీకి గురైనట్లు గమనించాడు. పోలీసులు స్పందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు 'విజేత' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక మైదుకూరు రోడ్డులో ఉన్న విజేత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు బి.రవి కిరణ్, ఎన్.జగదీష్, పద్మజ షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్టు ఆ పాఠశాల కరెస్పాండెంట్ లక్ష్మీదేవి తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు కలెక్టర్, డిఇఒ చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక రాణివనంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం బిసిడిఎస్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్యులు గురు అభిలాష్ మాట్లాడుతూ శిబిరంలో చికిత్స నిమిత్తం 120 మంది వచ్చారని తెలిపారు. వీరిలో కంటి అద్దాలు అవసరమైన వారికి బ్యాక్వర్డ్ కమిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో భాగంగా ప్రొద్దుటూరులోని అభిలాష్ నేత్ర వైద్యశాలలో చేస్తామన్నారు. శస్త్ర చికిత్స సమయంలో డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వారికి ఉచితంగా రూము ఇవ్వడంతోపాటు, భోజన సదుపాయం, ఛార్జీలిస్తామన్నారు. కార్యక్రమంలో బిసిడిఎస్ ప్రెసిడెంట్ యాదప్ప, సొసైటీ సభ్యులు, అభిలాష్ నేత్ర వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న గురు అభిలాష్

గురజాలలో నేలకొరిగిన అరటి చెట్లు

గాలివాన బీభత్సం

నేలకొరిగిన అరటి తోటలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గురజాల, సింహాద్రిపురం, హిమకుంట్ల తదితర గ్రామాల్లో భారీ గాలులతో వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా పది ఎకరాల్లో 5 వేల అరటి చెట్లు పడిపోయాయి. గురజాలలో శ్రీధర్‌రెడ్డి అనే రైతుకు చెందిన 500 అరటి చెట్లు గాలికి కింద పడిపోయాయి. మరికొంతమంది రైతుల అరటి చెట్లు పడిపోవడంతో మండల వ్యాప్తంగా దాదాపు రూ.20లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో ఆదివారం జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు, పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ అందించిన వివరాల ప్రకారం అమ్మాయి వయసు 13 సంవత్సరాలు కావడంతో అడ్డుకున్నారు. 18ఏళ్లు దాటకుండా వివాహం చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. బాలికను కడపలోని వసతిగృహానికి తరలించారు.

అందరూ యోగా చేయొచ్చు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అన్ని వయసుల వారు యోగా చేయవచ్చని గురువు వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం ఆయన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 65 సంవత్సరాలు పైబడిన వారికి యోగా శిక్షణనిచ్చారు. యోగా చేయడం ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా శిక్షణలో సీనియర్ సిటిజెన్లు

'ఉపాధి'లో నీటి తొట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో నీటితోట్లు ఏర్పాటుతో చాలావరకు పశువులకు తాగునీరు కొరత తీరినట్లయింది. మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలోను పశువుల సంఖ్య ఆధారంగా ఒకటి, రెండు నీటి తొట్లను నిర్మించారు. ఒకొక్క నీటి తొట్టికి దాదాపు రూ.30 వేలు ఖర్చు చేశారు. దీంతో పాటు సమీపంలోని పైపులైన్ నుంచి నీటి సరఫరాను సైతం ఏర్పాటు చేసి నీటితో నింపుతున్నారు.పశువులు, జీవాలు మేతకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు వాటి కాపరులు నీటి తొట్టి వద్దకు వచ్చి నీటిని తాపుకుని వెళుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 10,400 పశువులు, 24,500 గొర్రెలు, మేకలు ఉన్నాయి.

పశువుల నీటి కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టి

ఎంతో ఉపయోగకరంగా ఉంది..

ఉపాధి హామీ పథకంలో పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టి ఎంతో ఉపయోగకరంగా ఉంది. గతంలో నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడే వాళ్లం. ప్రస్తుతం గ్రామ సమీపంలోనే నీటి తొట్టి ఏర్పాటుతో మేతకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు పశువులకు నీటిని తాపుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

- లక్ష్మీదేవి, పశువుల యాజమాని, సింహాద్రిపురం

సద్వినియోగం చేసుకోవాలి..

పశువులు, గొర్రెల, మేకల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే మండల వ్యాప్తంగా 23 చోట్ల నిర్మించాం. పాడి రైతుల వినతి మేరకు మరికొన్ని చోట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

- కృష్ణమూర్తి, ఎంపిడిఒ, సింహాద్రిపుర

ఏ ఘనకార్యం చేసిందని విజయోత్సవం

పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఏ ఘనకార్యం చేసిందని విజయోత్సవం చేయాలని పిలుపునిచ్చిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 12న టిడిపి కూటమి 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించడం హాస్యాస్పదమని చెప్పారు. కేవలం ఏడాది కాలంలో ఒకటిన్నర లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసినందుకా అని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15,480 కోట్ల అదనపు భారం విద్యుత్ వినియోగదారుల మీద మోపి వీర బాదుడు బాధినందుకా అన్నారు. మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్టు షాపులు అన్నట్లు మద్యం పాలసీని చేసి ఇంటికో తాగుబోతును తయారు చేస్తున్నందుకా అని మండిపడ్డారు. రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా తయారు చేసినందుకా అని విమర్శించారు. రాష్ట్రాన్ని డ్రగ్ ఆంధ్ర ప్రదేశ్‌గా, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చినందుకా అన్నారు. నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను నమ్మించి మోసగించినందుకా లేక తల్లికి వందనం హామీని అమలు చేయకుండా తల్లులను, పిల్లలను నమ్మించి మోసగించినందుకా అన్నారు. అన్నదాత సుఖీభవ హామీని అమలు చేయకుండా అన్న దాతలను నమ్మించి మోసాగించినందుకా అని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధిని అమలు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. ఉపా ధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. రాష్ట్రానికి సంజీవనీ లాంటి ప్రత్యేకహోదా సాధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేకప్యాకేజీ సాధించనందుకా విజయోత్సవమని విమర్శించారు. కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం, దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణం తదితర విభజన చట్టంలోని అంశాలను అమలు చేయలేదన్నారు. తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమం లేకుండా చేసినందుకా అన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని నరేంద్ర మోడీ వద్ద తాకట్టుపెట్టినందుకా అన్నారు. టిడిపి కూటమి పాలనలో రాష్ట్రం పరిస్థితి పెనం మీద నుండి మండే నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని తులసిరెడ్డి అన్నారు. విజయోత్సవ ర్యాలీలు చేసుకునే అర్హత టిడిపి కూటమి పార్టీలకు ఏమాత్రం లేదని తులసిరెడ్డి పేర్కొన్నారు.

లింగాలదిన్నె వంకకు వంతెన కలేనా..?

లింగాలదిన్నె వంకలో దర్శనమిస్తున్న బండరాళ్ల చప్పట

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 22, 23 వార్డుల పరిధిలో వచ్చే గొల్లపల్లె, లింగాలదిన్నె గ్రామాల మధ్య ఉన్న వంకపై వంతెన లేక చాలా అధ్వానంగా ఉంది. లింగాలదిన్నె వద్ద ఉన్న గోడేరు వంకకు ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బండరాళ్ల చప్పట మాత్రమే ఇప్పటికీ కనిపిస్తోంది. మైదుకూరు మున్సిపాలిటీ ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ ఈ వంకపై హై లెవెల్ వంతెన ఏర్పాటుకు నోచుకోవడంలేదు. వర్షం వచ్చిన సందర్భంలో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో మైదుకూరుకు చేరుకోవాలంటే వని పెంట మీదుగా రావలసిన పరిస్థితి. సాధారణ రోజుల్లో కూడా వంకలో కొద్దిపాటి నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు జరిగిన తర్వాత కూడా వంతెనకు మోక్షం కలగలేదు. ఈ రహదారి వెంబడి వెంక టాపురం, గొల్లపల్లె, లింగాలదిన్నె, కోనాయిపల్లి, ఉత్పలవరం గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆ రెండు వార్డులకు సంబంధించి ప్రధాన సమస్య అయిన హై లెవెల్ బ్రిడ్జి త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మున్సిపాలిటీ ఏర్పడక మునుపు ఈ గ్రామాలు గ్రామ పంచాయతీలుగా కొనసాగేవి. గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లుగా ఉన్న రోజులలో కూడా ఈ వంకపై హై లెవెల్ బ్రిడ్జికి ఎవరు సహకరించలేదు. అంతేకాకుండా చిన్న గ్రామపంచాయతీలు కావడంతో సాధారణ నిధులతో ఏర్పాటు చేసే అవకాశం లేకుండా పోయింది. మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత ప్రత్యేక నిధులతో హై లెవెల్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తారని ప్రజలు భావించారు. అయితే ప్రజల అవసరాలను, ఇబ్బందులను ప్రజా ప్రతినిధులు, అధికారులు గుర్తించడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మున్సిపాలిటీ ఏర్పడి ఎనిమిదేళ్ళు పూర్తయినా పంచాయతీగా ఉన్న సంద ర్భంలో జరిగిన అభివృద్ధి మాత్రమే దర్శనమిస్తోంది. ఇప్పటికైనా లింగాల దిన్నె రహదారికి ఇబ్బందికరంగా ఉన్న వంకపై హై లెవెల్ బ్రిడ్జిలను ఏర్పాటు చేసే దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాయలసీమ ఇన్‌ఛార్జి అయూబ్ ఖాన్ అన్నారు. ఎంపీజే ఆధ్వర్యంలో ఆదివారం విద్యా జాగృతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయూబ్ ఖాన్ మాట్లాడుతూ విద్య ద్వారా విజ్ఞానం వస్తుందన్నారు. విద్య మనిషిని ఉన్నత స్థానానికి ఎదిగిస్తుందని వివరించారు. సైదాగారి వీధిలో విద్యార్థులను బడిలో చేర్పిస్తాం అనే నినాదంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుకుంటే వారి తలరాత బాగుంటుందన్నారు. విద్య నేర్చుకో తలరాత మార్చుకో అనే నినాదంతో తల్లిదండ్రులకు పిల్లలకు క్లుప్తంగా వివరించారు. సర్వే చేసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. మాజీ అధ్యక్షులు ఎస్పీ ముక్తియార్, గౌస్ లాజం, షఫీ అహ్మద్, హుస్సేన్ బాషాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు హుస్సేన్ బాషా, జిల్లా నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు గౌస్‌లాజం, శాంతినికేతన్ కరస్పాండెంట్, ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, మీడియా కార్యదర్శి అస్లాం, సభ్యులు యూసుఫ్, ఫరాన్, సోహెల్ పాల్గొన్నారు.

విద్య ప్రాముఖ్యత గురించి ప్రచారం చేస్తున్న ఎంపీజే సభ్యులు

జర్మనీలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటిలో చదివిన పూర్వ విద్యార్థి భోగం హరీష్‌కుమార్ వరల్డ్ ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈనెల 11న జర్మనీలోని కెమ్నిట్జ్‌లో జరిగే వరల్డ్ ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భోగం హరీష్‌కుమార్ 83 కిలోల ఓపెన్ విభాగంలో పాల్గొనున్నారు. భారతదేశం అంతట పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు హరీష్‌కుమార్ నుండి అద్భుత ప్రదర్శన కోసం ఎదురుచూస్తున్నారు. మంచి ప్రతిభను చూపి మాతృభూమికి అవార్డులతో తిరిగి రావాలని కోరుకుంటున్నారు. హరీష్‌కుమార్‌ను ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పవర్ లిఫ్టింగ్ కోచ్ బాల గోవింద తివారీ అభినందించారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు, కూటమి నాయకులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ మెయిన్ గేటు వద్ద ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు చేపట్టిన నిరసన ఆదివారం కూడా కొనసాగింది. తమ డిమాండ్లను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ నాలుగు రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నారు. వీరికి కూటమి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ వేతనాలు పెంచాలన్నారు. కేవలం రూ.470 మస్టర్ ఇస్తున్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న జువారి, భారతి సిమెంట్ పరిశ్రమలలో రూ.800 మస్టర్ ఇస్తున్నారన్నారు. 22 ఏళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నామన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెల రోజుల్లో కేవలం 15 రోజులు మాత్రమే పని దినాలు కల్పిస్తున్నారని వాపోయారు. తమకు 26 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. విధుల్లో ఉన్నప్పుడు తాగు నీరు, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని కార్మికులు కోరారు. టిఫిన్, భోజనాలు ఉద్యోగస్తులతోపాటు తమకు ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రి సౌకర్యం కల్పించాలన్నారు. తమ పిల్లలకు పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. ప్యాకింగ్ ప్లాంట్‌లో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. యాజమాన్యం స్పందించకపోవడంతో 50 మంది కార్మికులు విధులను గత 45 రోజులుగా బహిష్కరించారు. అయితే ఇప్పటికీ స్పందించకపోవడంతో నాలుగు రోజులుగా మెయిన్ గేటు వద్ద టెంటు ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటూ నిరసన కొనసాగిస్తున్నారు. భోజనాలకు కూడా ఇళ్లకు వెళ్లకుండా ఫ్యాక్టరీ వద్దనే వండుకొని తింటున్నారు. సమస్యలను ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ క్రమంలో వారు తమకు మద్దతు తెలిపి కూటమి నాయకులను నిరసనలో పాల్గొనాలని ఆదేశించారన్నారు. వారితో పాటు సమీప గ్రామస్తులు కూడా నిరసనలో పాల్గొని కార్మికులకు మద్దతు ఇస్తున్నారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీనివాసులు, సుబ్బయ్య, బాలాజీ, వెంకట రవి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగరాజు, కూటమి నాయకులు పెద్ద సేట్, దాసరి రాజారెడ్డి, నాగేశ్వరరెడ్డి, గంగాధర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుదర్శన్, రమేష్ నాయుడు, జంగం రెడ్డి, సుదర్శన్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అంకాలమ్మను దర్శించుకున్న ఎంపీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి ఆలయంలో ఆదివారం కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి నాయకులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ముద్దనూరు రోడ్డులోని జడ్‌పి ఉన్నత బాలుర పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. 1975-76 విద్యా సంవత్సర విద్యార్థులు ఆదివారం సూర్యనారాయణరెడ్డి తోటలో సమావేశం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలనుకున్నారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులరెడ్డి ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఆయనకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇచ్చిన డబ్బుతో ప్రహరీ, కొదవ ఉన్న దేశ నాయకులు, శాస్త్రవేత్తల చిత్రపటాలు గీయిస్తామన్నారు. 50 సంవత్సరాల క్రితం చదువుకున్న పాఠశాలను గుర్తుపెట్టుకోవడం అభినందనీయమని అన్నారు. ఇలా పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రఓబులరెడ్డి, పూర్వ విద్యార్థులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మిరెడ్డి, అన్వర్‌బాషా, మల్లారెడ్డి, శ్రీనివాసమూర్తి, వాసుదేవ రెడ్డి, జయరాం పాల్గొన్నారు.

మూసేసిన ఆంజనేయపురం ప్రభుత్వ పాఠశాల

పాఠశాల తెరవాలని గ్రామస్తుల వేడుకోలు

ఈ ఏడాదైనా అధికారులు స్పందిస్తే.. పిల్లల్ని పంపిస్తాం : తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెన్నముక్కపల్లె పంచాయతీ ఆంజనేయపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొన్నేళ్లుగా మూతపడింది. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల విలీన ప్రక్రియ చర్యలలో భాగంగా ఈ పాఠ శాలను మూసివేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని విద్యార్థులు పొరుగు గ్రామా లైన కొత్తపేట, కొత్త నెల్లూరు పాఠశాలలకు వెళుతున్నారు. విద్యార్థులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని పలుమార్లు విద్యాశాఖ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. తమ గ్రామ పాఠ శాలలో విశాలమైన తరగతి గదులు ఉన్నాయన్నారు. పునఃప్రారంభానికి అధి కారులు చర్యలు చేపట్టలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదైనా ప్రజా ప్రతి నిధులు, విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి పాఠశాలను తెరిపించేలా చర్యలు చేపడితే విద్యార్థులకు ఇబ్బందులు ఉండవని అంటున్నారు. గ్రామంలో దాదాపు 20 మందికి పైగా విద్యార్థులు పాఠశాలకు వెళుతున్నారని తెలిపారు. కొందరు ప్రయివేట్ పాఠశాలకు వెళుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠ శాలను తెరి పిస్తే ఇక్కడికే తమ పిల్లలను పంపిస్తామని పలువురు తల్లిదండ్రులు పేర్కొం టు న్నారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచన చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్కౌట్‌తో నైపుణ్యానికి మెరుగు

జనసేన పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

గైడ్స్ శిక్షణ వలన విద్యార్థుల నైపుణ్యం మెరుగు పడుతుందని రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్, గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపు ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉపాధ్యాయుల ఆహ్వానం మేరకు శ్రీనివాసరాజు శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. క్యాంపులో శిక్షణ పొందుతున్న 107 మంది బాలికలను పరామర్శించి వారికి కల్పిస్తున్న వసతులు గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ జీవితంలో మనం ఎలా ముందుకెళ్లాలో నేర్పిస్తుందని తెలిపారు. బాలికలు మెరుగైన శిక్షణ పొంది భవిష్యత్తులో శక్తివంతమైన మహిళలుగా ఎదిగి దేశం గర్వపడేవిధంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, సమ్మెట శివప్రసాద్, కడిమెల్ల శ్రీనివాసరాజు, పి.వి.ఆర్ కుమార్, లక్ష్మీ నరసయ్య, బుజ్జిబాబు, శివశంకర్ రాజు, ఉపాధ్యాయులు శేషారెడ్డి, లక్ష్మీకర్, వీరయ్య, రాజేష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు, ప్రొద్దుటూరు నందు

O.S.No.60/2018

వల్లెల గురువయ్య తండ్రి గురువయ్య, 57 సంIIలు, కానపల్లి గ్రామం, కొత్తపల్లి పంచాయితీ, ప్రొద్దుటూరు(మం),కడప జిల్లా ....వాది

VS

09) వల్లెల యల్లమ్మ తండ్రి గురువయ్య, 65 సంII C/o యల్లనూరు అనురాధా తండ్రి లేట్ గురువయ్య,51/33,సంధ్యాల రోడ్డు, భవాని స్ట్రీట్, ఎస్.మైదుకూరు, మైదుకూరు(మం),కడప జిల్లా

10) అంగడి గుర్రమ్మ భర్త నరసింహులు, తండ్రి వల్లెల గురువయ్య, 45 సంII డి.నెం.1/92ఎ, చిన్న సింగనపల్లి గ్రామం,కడప(మం),కడప జిల్లా

11) యమ్మన బోయిన సుబ్బలక్ష్మీ భర్త వెంకటరమణ, 30 సంII డి.నెం. 1/37-1,లింగాలదిన్నె గ్రామం, కడప(మం), కడప జిల్లా,

12) యల్లాల అనురాధ భర్త చెంగ్రాయుడు, తండ్రి లేట్ గురువయ్య,51/33,సంధ్యాల రోడ్డు, భవాని స్ట్రీట్, ఎస్.మైదుకూరు, మైదుకూరు(మం),కడప జిల్లా ...ప్రతివాదులు

ప్రతివాదులు 09 నుండి 12 వరకు దావా సమను

పై దావాలోని వాది దావా షెడ్యూలు దాఖల ఆస్తి యందు భాగపరిష్కారం కోరుతూ దావా దాఖల చేసి యున్నారు. పై దావాలో మీ తండ్రి గారైన వల్లెల గురువయ్య మరణించినందున మిమ్మల్ని ప్రతివాదులుగా చేర్చి సమన్లు ఇవ్వవలసినదిగా పై కోర్టు వారు ఆదేశించి యున్నారు. కాని మీరు కోర్టు వారు ఇచ్చిన సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై దావా నందు మీరు హాజరగుటకు గాను 16-06-2025వ తేదీ వాయిదా ఉన్నది. కావున సదరు తేదీన మీరు స్వయంగాని, వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టు నందు పై తేదీన ఉదయం 10-30 గంటలకు హాజరై అభ్యంతరాలు తెలుపుకొనవలెను. లేనందున మీ పరోక్షమున పై దావాను తీర్మానించబడును

// BY ORDER OF THE COURT //

జింకా రవి,B.Com., B.L.,అడ్వకేట్,
ప్రొద్దుటూరు,కడప జిల్లా